## గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 4: వేసవిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, విద్యుత్, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దామరచర్ల మండలంలోని ఇండియా సిమెంట్, అంబుజా(పెన్నా) సిమెంట్ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సిమెంట్ పరిశ్రమల పరిధిలో ఉన్న గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఆయా గ్రామాల్లో విద్యా, వైద్యం, మౌలిక వసతులను సీఎస్‌ఆర్ నిధుల ద్వారా అందించాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తాసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- అమ్మనబోలు మూసీ వాగు వద్ద చెక్‌పోస్ట్
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



చెక్‌పోస్టు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నార్కట్‌పల్లి, మార్చి 4 : మండలంలోని అమ్మనబోలు మూసీ పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. మంగళవారం మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇసుక రీచ్‌లను ఆయన సందర్శించారు. వాగును గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అమ్మనబోలు గ్రామంలో ప్రత్యేక చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చిపోయే వాహనాల వివరాలు సేకరించి నోట్ చేసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మూసీ పరీవాహక ప్రాంత నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లేదన్నారు. ఇసుక తరలించే వారికి సహకరించిన వారిపైన కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ ఉన్నారు.

## పంట ఎండిన రైతులకు పరిహారం అందించాలి : సీపీఎం



అప్పాజీపేటలో ఎండిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, మార్చి 4: సాగునీరందక పంటలు ఎండిపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు పోలె సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే కాల్వ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి అప్పులు తెచ్చి పంటలు సాగు చేశారని, పంట చేతికొచ్చే సమయంలో సాగునీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ఓరుగంటి పాండు, పోషబోయిన భిక్షం, లింగయ్య, బొడ్డుపల్లి నగేశ్, యాదయ్య, వెంకన్న సైదులు పాల్గొన్నారు.

## రైతులు పంట మార్పిడి పద్ధతులను పాటించాలి

- భూగర్భ జలవనరులశాఖ డీడీ రేవతి

నల్లగొండ, మార్చి 4: జిల్లాలో భూగర్భ జల మట్టం తగ్గిపోతున్నందున రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంభించి తక్కువ నీటితో సాగయ్యే పంటలు వేయాలని భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రేవతి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఫిబ్రవరి 2025 నాటికి 7.74 మీటర్లకు భూగర్భ జల మట్టం పడిపోయినందున రైతులు నీటిని వృథా చేయవద్దని సూచించారు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు తీసుకోవడంతో పాటు ఇంటి పైకప్పు నుంచి పడే వాన నీటిని అందులో మళ్లించాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో కూడా పామ్‌పాండ్లు నిర్మించుకోవాలని కోరారు. నివాస, వ్యవసాయ బోరు బావులు మినహా పారిశ్రామిక, మైనింగ్, బల్క్ వాటర్ సప్లై, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ కోసం బోర్లు వేసుకున్న వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇండ్లు, వ్యవసాయ క్షేత్రాల్లో బోరు బావులు తవ్వుకునే వారు తాసీల్దార్, బోరు బండ్ల యజమానులు భూగర్భ జలవనరుల కార్యాలయంలో అనుమతి తీసుకోవాలని సూచించారు.

## సైన్స్ ఒలింపియాడ్‌లో న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నకిరేకల్, మార్చి 4 : సీఎల్‌బీ లక్ష్మీబాయమ్మ స్టేట్ లెవల్ మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో న్యూవిజన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి స్టేట్ ర్యాంకులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ బి.అశోక్ తెలిపారు. పాఠశాలకు చెందిన పాదూరి శ్రీనిధి, బానోతు మోహన్, చందా శ్రీనందన్, కంచరకుంట్ల సంప్రీతి, టి.నక్షత్ర, ఏరుకొండ కృత్విక స్టేట్ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పరీక్షల ఇన్‌చార్జి కె. రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు దరఖాస్తులు

నల్లగొండ సిటీ, మార్చి 4 : హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళిశాఖ సంచాలకుడు ఎస్ ద్వారక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో వచ్చే విద్యా సంవత్సరానికి కోర్సులో చేరేందుకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు నల్లగొండలోని చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★ ఇంటి స్థలం యాదగిరిగుట్టకి 1 కి.మీ., వరంగల్ హైవేకి 3 కి.మీ., రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి అతి దగ్గరలో రెసిడెన్షియల్ ప్లాట్లు అమ్మబడును. B.T. Road Face... ఈరోజే ఇల్లు/కాటేజ్/గెస్ట్‌హౌస్ కట్టుకోవచ్చు. LRS కలదు. Cont: 6300765739.
NT-329217

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

## బాలికలు బాగా చదివి ఉన్నతంగా ఎదుగాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ పబ్లిక్ స్కూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, మార్చి 4 : బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదుగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. వంటగదిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యార్థినులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఇష్టపడి చదివితే గొప్పగా రాణిస్తారని, కుటుంబంలో సమాజంలో గౌరవం పెరుగుతుందని అన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ బాలరాజ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శౌరి ఉన్నారు.

### నీట్ కోసం పరీక్ష కేంద్రాల పరిశీలన

నల్లగొండ : మే-4న జిల్లా కేంద్రంలో నీట్ పరీక్ష నిర్వహించేందుకు ఐదు కేంద్రాలు కావాల్సి ఉండగా పట్టణంలోని పలు పాఠశాలలను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. చర్లపల్లిలోని విపస్య పాఠశాలతో పాటు జిల్లా కేంద్రంలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌ను ఆమె పరిశీలించారు. అరబిందో, ఎస్పీఆర్, నారాయణ పాఠశాలలను కూడా పరిశీలించాలని డీఆర్వోను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి వాటిని పరిశీలించారు. నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మౌళిక వసతుల కల్పనకోసం పాఠశాలలను తనిఖీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆమె వెంట డీఆర్వో అశోక్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, నీట్ లైజనింగ్ ఆఫీసర్ పార్థసారధి ఉన్నారు.

## మహిళలకు వైద్య శిబిరం

నల్లగొండ, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్ సహకారంతో మహిళలకు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, గైన కాలజిస్టులు వసంతకుమారి, రాజేశ్వరి, విశ్వజ్యోతి, వైద్యులు సందీప్, విఠల్, వెంకట్‌రెడ్డి, ధరణిధర్, రవిప్రసాద్, రమ్య సుధ, సునీత, సుమలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో మాదిగల డప్పు యాత్ర

శాలిగౌరారం, మార్చి 4 : రాష్ట్రంలో మాదిగల జనాభా ప్రకారం 11శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ శాస్త్రీయంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, నాగరాజు, సైదులు, ప్రతాప్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చందంపేట, మార్చి 4 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన చందంపేట మండలంలోని పోలేపల్లి బిల్డింగ్‌తండా వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలం మానావత్‌తండాకు చెందిన రమావత్ పాండు (50) బైక్‌పై తన ఇద్దరు భార్యలతో కలిసి దేవరకొండ నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. మానావత్‌తండా వైపు వెళ్తేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌ను మహేంద్ర జీపు ఢీకొట్టింది. దాంతో పాండు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

### గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

కొండమల్లేపల్లి, మార్చి 4 : అక్రమంగా గోవులను తరలిస్తున్న మినీ వ్యాన్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మండలంలోని చెన్నారం గేటు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టగా 160 పశువులను రవాణా చేస్తున్న మినీ డీసీఎంను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గోవులను తరలిస్తున్న యాచారపు రమేశ్, యాచారపు శేఖర్‌ను అదుపులోకి తీసుకొని డీసీఎంను సీజ్ చేసినట్లు తెలిపారు. గోవులను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోగల గురునానక్ గోశాల కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

### పీఆర్‌టీయూ నాయకుల సంబురాలు

మర్రిగూడ, మార్చి 4 : టీచర్స్ ఎమ్మెల్సీగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పీఆర్‌టీయూ నాయకులు మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో సంబురాలు జరుపుకొన్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు పాల్వాయి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాస బాలరాజు, నాయకులు బిట్టు శ్రీనివాస్, బాలాజీ నాయక్, లింగస్వామి, కరుణాకర్ రెడ్డి, రాజు, సవిత, సుమన, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

- జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



నకిరేకల్ : మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నకిరేకల్/కేతేపల్లి, మార్చి 4 : గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీసీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నకిరేకల్, కేతేపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో తాగునీరు, జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని, వేసవిలో మొక్కలు వాడిపోకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధవి, ఏపీఓ రమణయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారుల దాడులు

**22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 450 క్వింటాళ్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ పట్టివేత**

చిట్యాల: మండలంలోని రెండు రైస్ మిల్లులపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మిల్లుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు 450 క్వింటాళ్ల సీఎంఆర్ బియ్యాన్ని సీజ్ చేశారు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ అంజయ్య నేతృత్వంలోని ప్రత్యేక బృందం నల్లగొండ పౌరసఫరాలశాఖ అధికారులతో కలిసి చిట్యాల మండలంలోని వట్టిమర్తి, వనిపాకల గ్రామాల్లోని రెండు రైసు మిల్లలపై దాడులు నిర్వహించారు. వట్టిమర్తిలోని మిల్లులో 6 క్వింటాళ్లు, వనిపాకలలోని మిల్లులో 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. వట్టిమర్తి రైస్‌మిల్లులో చిట్యాలకు చెందిన మరో రైసు మిల్లుకు సంబంధించిన సీఎంఆర్ నిల్వ ఉంచటంతో వాటిని కూడా సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో ప్రభుత్వానికి అందించకుంటే, వాటిని రైస్ మిల్లర్లు వ్యక్తిగతంగా వాడుకుంటే ఆయా మిల్లుల యజమానుల ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కమల్‌పాషా, స్వామిదాసు, శ్రీనివాసు, డీటీ దీపక్, ఆర్ఐ రామారావు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి, మార్చి 4 : అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేశ్యతండా సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ డీసీఎంను నిలిపి తనిఖీ చేశారు. అందులో ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని బియ్యాన్ని రవాణా చేస్తున్న నిందితులు సోమ రామకృష్ణ, అబ్దుల్ ఖాజా రహమాన్, మహ్మద్ మాజిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. డీసీఎంను సీజ్ చేసి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### మిర్యాలగూడ మండలంలో..

మిర్యాలగూడ రూరల్, మార్చి 4 : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మంగళవారం రూరల్ పోలీసులు పట్టుకొన్నారు. రూరల్ ఎస్ఐ పిల్లి లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంటాద్రిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కేశవనగర్ కాలనీకి చెందిన ధీరావత్ సోని పేదల నుంచి మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి నిల్వ ఉంచింది. బీట్ పోలీసులు గమనించి పట్టుకొన్నారు. రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించి నింధితురాలు సోనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## కిందపడి వ్యక్తి మృతి

చిట్యాల, మార్చి 4 : అనారోగ్యంతో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని వట్టిమర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎన్.ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిమర్తి గ్రామానికి చెందిన మాదరబోయిన ముత్యాలు (54) కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. రెండు రోజులుగా అనారోగ్యంతో పనికి వెళ్లడం లేదు. మంగళవారం ముత్యాలు ఇంటివద్దే ఉండగా .. అతడి భార్య పనికి వెళ్లింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ముత్యాలు తన ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు విషయాన్ని అతడి భార్యకు తెలిపారు. ఆమె ఇంటికి వచ్చి చూడగా తలకు బలమైన గాయం కావడంతో ముత్యాలు మృతి చెంది ఉన్నాడు. అనారోగ్యంతో కళ్లు తిరిగి కింద పడడంతో మృతి చెంది ఉండవచ్చని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి : డీవైఎఫ్ఐ


కొండమల్లేపల్లి, మార్చి 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్‌డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, పెద్దిశివ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట : సీపీఎం

చిట్యాల, మార్చి4 : ప్రజా సమస్యల పరిష్కారానికి బుధవారం నుంచి సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట చేపడుతున్నట్లు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించి వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు జిట్ట సరోజ, అవిశెట్టి శంకరయ్య, పామనుగుండ్ల అచ్చాలు, కత్తుల లింగస్వామి, ఐతరాజు నర్సింహ, బొబ్బలి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందు పార్వతి





మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మిర్యాలగూడ, మార్చి 4: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందు పార్వతి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్తుండగా పట్టణ పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పరిష్కరించకుండా మోసం చేశారన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు 10 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారు. అర్హులైన మినీ అంగన్‌వాడీ టీచర్లుకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

నకిరేకల్, మార్చి 4 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఐసీడీఎస్ రాష్ట్ర ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వంటె పాక వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు పొడిశెట్టి నాగమణి, కార్యకర్తలు సుభాషిణి, లలిత, అన్నపూర్ణ ఉన్నారు.

### మాడ్గులపల్లిలో..

మాడ్గులపల్లి : హైదరాబాద్‌కు వెళ్తున్న మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు సులోచన, అరుణ, జానకి, సీఐటీయూ నాయకుడు రొండి శ్రీనివాస్ ఉన్నారు.

## ఇంటర్మీడియల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నందికొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు, సిబ్బంది

నల్లగొండ, మార్చి 4: ఈ నెల 5 నుంచి 20 వరకు నిర్వహించే ఇంటర్మీడియల్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తాసీల్దార్లను ఆదేశించారు. పరీక్ష సెంటర్‌కు 200 మీటర్ల పరిధిలో ఎవరినీ అనుమతించవద్దని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రస్తుతం వేసవి తీవ్రత దృష్ట్యా ఆయా కేంద్రాల్లో తాగునీటిని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఏర్పడితే హెల్ప్‌లైన్ నంబర్ 7730866967కు సమాచారం ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

### సాగర్‌లో రెండు కేంద్రాలు

నందికొండ : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీసీ గురుకుల పాఠశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పి. సతీశ్ చంద్ర, రాజశేఖర్ తెలిపారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

### మర్రిగూడలో రెండు కేంద్రాలు

మర్రిగూడ : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల కోసం మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్, కేజీబీవీ కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడవిదేవులపల్లి, మార్చి 4: మండలంలోని కొత్త నందికొండ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు రమావత్ బాలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి బాలు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు ధనావత్ చిట్టిబాబునాయక్, బాలాజీనాయక్, కుర్ర సేవ్యానాయక్, కొత్త మర్రెడ్డి, భీమానాయక్, పేర్ల లింగయ్య, కనిగిరి శ్రీను, బండి వెంకటేశ్వర్లు, ఎండీ. షోయబ్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుడికి ..

మిర్యాలగూడ రూరల్ : మండలంలోని హట్యాతండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ధీరావత్ జానునాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మాజీ ఎమ్మెల్యే త్రిపన విజయసింహారెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి జానునాయక్‌ను పరమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నూకల హన్మంతరెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్ ఉన్నారు.

## బాలికల పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ, మార్చి 4: ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ పంపిన బూట్లను డబ్బులు వసూలు చేసిన పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ విషయమై సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కొన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అందులోని పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, బెల్ట్, షూ వంటివి కలెక్టర్ నిధుల నుంచి కొనుగోలు చేసి అందించారన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాత్రం విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసే సమయంలో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు అంటూ పిల్లల నుంచి రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేశారని ఆరోపించారు. ఈ విషయమై విచారణ నిర్వహించి ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసన్న, మౌనిక, రాధిక, వరలక్ష్మి, భూలక్ష్మి, రాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

నల్లగొండ రూరల్, మార్చి 4: నల్లగొండ పట్టణంలోని శస్త్ర పాఠశాలలో మంగళవారం 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిచారు. నల్లగొండ మొదటి అడిషనల్ సెషన్ జడ్జి సంపూర్ణ ఆనంద్, రిటైర్డ్ అధ్యాపకుడు అక్కెనపల్లి మీనయ్య ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ అంశాల్లో రాణించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గిరి లింగయ్యగౌడ్, స్వప్న, ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైకుంఠధామంలో మౌలిక వసతులు కల్పించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



కతాలగూడ వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న వీరారెడ్డి

నల్లగొండ రూరల్, మార్చి 4 : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కతాలగూడ వైకుంఠధామానికి ప్రహరీ నిర్మించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా 11వ వార్డు సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విలీన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగర్జు, నాయకులు సయ్యద్ హాషం, కొండ అనూరాధ, ఉప్పల గోపాల్, కొండ వెంకన్న, యాదయ్య, లింగస్వామి, రాములు, యాదయ్య, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సలీమ్ పాల్గొన్నారు.

## మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర

కట్టంగూర్, మార్చి 4 : మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పజ్జూరి ఉపేంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని ఈదులూరు గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ కూలీలకు కనీసం వేతనంగా రోజుకు రూ.600 చెల్లించాలని, కూలీలందరికి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు బూరుగు లక్ష్మమ్మ, సభ్యులు షేక్ జాహెదా, వరమ్మ, సువీల, స్వరూప, మంగమ్మ, రేణుక, సైదమ్మ పాల్గొన్నారు.